# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 125 | బుధవారం 07, జనవరి 2026 | పేజీలు: 07 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



విలేకరులు కావలెను
ప్రజాస్వరం
పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.
సెల్ : 800 860 9999





## రూ.8000 కోట్లతో ఓఆర్ఆర్ చుట్టూ
# వాటర్ గ్రిడ్!

**ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ 140 కిలోమీటర్ల వాటర్ రింగ్ మెయిన్ నిర్మాణం**
**ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసిన జలమండలి**
**త్వరలో ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించి పరిపాలన, ఆర్థిక అనుమతులు కోరనున్న అధికారులు**
**గోదావరి, కృష్ణా సహా అన్ని నీటి వనరులను అనుసంధానించి సరఫరా**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
భాగ్యనగర ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ జలమండలి (HMWSSB) ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. నగరానికి నిరంతరాయంగా, ఎలాంటి అంతరాయం లేకుండా నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ఏకంగా రూ.8,000 కోట్ల అంచనా వ్యయంతో భారీ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు (ORR) వెంబడి ఒక వాటర్ రింగ్ మెయిన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలన్న ఈ ప్రతిపాదనకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (DPR) కూడా పూర్తయింది. త్వరలోనే దీన్ని పరిపాలన, ఆర్థిక అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులు ..మిగతా 3లో

## టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు

**సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చిన జగ్గారెడ్డి**
**మున్సిపల్ ఎన్నికల ప్రచారాని తనను పిలవొద్దన్న జగ్గారెడ్డి**
**అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని సూచన**


02

## కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు

**దానం నాగేందర్, కడియం శ్రీహరి కాంగ్రెస్ లోకి వస్తారని ఎవరూ అనుకోలేదని వ్యాఖ్య**
**కవిత కూడా కాంగ్రెస్‌లో చేరవచ్చని అభిప్రాయపడిన మల్‌రెడ్డి రంగారెడ్డి**
**నాకు మంత్రి పదవి ఇవ్వండి అంటూ హైకమాండ్ కు విజ్ఞప్తి**


02

## సహకారం ఏదీ..?

**స్వయం ఉపాధికి చేయూతనివ్వని సహకార ఆర్థిక సంస్థలు**
**ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అచేతన స్థితిలోకి**
**యువతకు ఉపాధి శిక్షణ కూడా అందించలేక నీరసించిన వైనం**
**సంక్షేమ శాఖల పరిధిలో ప్రస్తుతం 30 కార్పొరేషన్లు.. చైర్మన్లు మాత్రం కొన్నింటికే**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
సహకార ఆర్థిక సంస్థలు.. సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక విభాగాలివి. ఈ కార్పొరేషన్ల ప్రధాన లక్ష్యం స్వయం ఉపాధిని ప్రోత్సహించడం.. రాయితీ అందిస్తూ స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సహకరించడం... నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు ఉపాధి మార్గాలను చూపించడం. కానీ ఉన్నత లక్ష్యంతో ఏర్పాటైన ఈ కార్పొరేషన్లు ఇప్పుడు అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాయితీపై రుణాల సంగతి అటుంచితే యువతకు కనీసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సైతం నిర్వహించలేకపోతున్నాయి.

**కాగితాల్లోనే వార్షిక ప్రణాళికలు..**
రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలతోపాటు వికలాంగులు, మహిళల కోసం 30 సహకార ఆర్థిక ..మిగతా 2లో



## ఐఐటీహెచ్ ఎయిర్ టాక్సీ వచ్చేసింది..!

**హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు ఇక 'టాటా'**
**ఐఐటీ హైదరాబాద్ నుంచి ఎయిర్ టాక్సీ బ్రేక్‌త్రూ**
**ట్రాఫిక్‌కు గుడ్‌బై.. గాలిలో ప్రయాణం**
**పైలట్ అవసరం లేని స్మార్ట్ ఎయిర్ టాక్సీ**
**ఎమర్జెన్సీ వైద్యంలో గేమ్ చేంజర్**


03

## ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తహసీల్దార్

**భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్**
**ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన వైనం**
**తహసీల్దార్, మధ్యవర్తిని అరెస్ట్ చేసిన అధికారులు**


02

## భవిష్యత్ తరాల కోసమే హిల్ట్ పాలసీ

**ఈ పాలసీ వెనుక ఆలోచన, లక్ష్యం ఉన్నాయి**
**పరిశ్రమల భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు**
**హైదరాబాద్ లో కాలుష్యం తగ్గించడమే మా లక్ష్యం**
**అసెంబ్లీలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రేపటి తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఈ పాలసీని కొందరు సాదాసీదా భూమార్పిడి కార్యక్రమంగా మాత్రమే చూస్తున్నారని, కానీ దాని వెనుక ఉన్న ఆలోచన, లక్ష్యం చాలా లోతైనదని ..మిగతా 3లో



## ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా?

**కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలన్న కాటిపల్లి**
**ఈవీల వినియోగం పెంచేందుకు కేంద్రం సబ్సిడీ ఇస్తోందని వెల్లడి**
**రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచన**

03


## అసెంబ్లీ గౌరవ సభలా లేదు.. కౌరవ సభ లా ఉంది..

**జనగామలో కేటీఆర్ ఫైర్ స్పీచ్**
**రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు**
**కేసీఆర్‌పై వ్యాఖ్యలపై మండిపాటు**
**కాంగ్రెస్ నేతలపై తీవ్ర దాడి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
వరంగల్ జిల్లా జనగామ వేదికగా జరిగిన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ తన ప్రసంగంతో రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు సిద్ధాంతాన్ని గుర్తు చేస్తూ, "కాలం వచ్చినప్పుడు కసిదీర కాటేయాలే" అనే మాటకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. పార్టీలో ఎటువంటి కీలక పాత్ర లేకపోయినా, కేవలం గౌరవంతో కడియం శ్రీహరిని ఉప ముఖ్యమంత్రిని చేసిన ఘనత ..మిగతా 3లో



## కాంగ్రెస్ సర్కారులో బీఆర్ఎస్ కోవర్టులు

**సీఎం సీరియస్, దర్యాప్తుకు ఆదేశం ?**
**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన హిల్ట్ పాలసీ పూర్తిగా రూపు దిద్దుకోకముందే బీఆర్ఎస్ చేతికి**
**ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన కేటీఆర్**
**సీఎం సీరియస్, విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ కోవర్ట్‌లు ఉన్నారా? అదీకూడా... పై స్థాయిలోనే ఉన్నారా? ప్రభుత్వంలో చీమ చిటుక్కుమన్నా వెంటనే సమాచారాన్ని ప్రతిపక్షానికి చేరవేస్తున్నారా? ఆ దొంగలెవరో ఇప్పుడు రేవంత్ సర్కార్ పసిగట్టేసిందా? హిల్ట్ పాలసీ లీక్‌తో తీగ లాగితే డొంకలే కదులుతున్నాయా? ఇంతకీ ఎవరా కోవర్ట్‌లు? వాళ్ళ విషయంలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతోంది? తెలంగాణ ప్రభుత్వం ..మిగతా 2లో

## త్వరలోనే కవిత రాజకీయ పార్టీ ?




**సంక్రాంతి తర్వాత జనం బాటలో కీలక ప్రకటనలు?**
**భవిష్యత్‌లో రాజకీయ శక్తిగా సభకు వస్తానన్న కవిత**
**ఇన్నాళ్ళు ఊహాగానాలే తప్ప కన్ఫామ్ చేయని ఎమ్మెల్సీ**
**రాజీనామాపై స్పీచ్‌లో కన్ఫామ్ చేసినట్టేనన్న అభిప్రాయం**
**జాగృతి జనం బాట పేరుతో జిల్లాల యాత్ర**

### కవిత రాజీనామాకి ఆమోదం

02
**కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం**
**ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత**
**నిజామాబాద్ లోకల్‌బాడీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ కన్ఫామ్ అయిపోయిందా? ఇన్నాళ్ళు ఉన్న అనుమానాలకు తాజాగా ఆమె క్లారిటీ ఇచ్చేశారా? వ్యక్తిగా బయటికి వెళ్తున్నాను. తిరిగి రాజకీయ శక్తిగా సభలో అడుగుపెడతానని చెప్పడం వెనక ఉద్దేశ్యం ..మిగతా 2లో


www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

# కవిత రాజీనామాకి ఆమోదం



- **కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం**
- **ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత**
- **నిజామాబాద్ లోకల్‌బాడీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కల్వకుంట్ల కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా అంశం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.. అయితే.. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె, తన రాజీనామా లేఖను ఇప్పటికే శాసనమండలి చైర్మన్‌కు సమర్పించారు. ఈ నేపథ్యంలో, సోమవారం శాసనమండలి వేదికగా ఆమె చేసిన ప్రసంగం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది.

బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో, ఆ పార్టీ తరపున గెలిచిన పదవిలో కొనసాగడం నైతికంగా సరి కాదన్న ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నిజానికి తాను గతేడాది సెప్టెంబర్ లోనే రాజీనామా లేఖను సమర్పించినట్లు గుర్తు చేసిన కవిత, దాన్ని వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు. అయితే, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ నిర్ణయంపై స్పందిస్తూ, భావోద్వేగంతో రాజీనామాలు చేయవద్దని, మరోసారి పునరాలోచించుకోవాలని ఆమెకు సూచించారు. అయినప్పటికీ, తన రాజీనామాకే కట్టుబడి ఉన్నానని కవిత తెలపడం గమనార్హం.

అయితే.. తాజాగా మంగళవారం మండలి నిరవధిక వాయిదా పడింది. ఈ క్రమంలోనే కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం తెలిపారు. మండలిలో వీడ్కోలు ప్రసంగం ముగించిన అనంతరం ఆమె తన భవిష్యత్తు కార్యాచరణను కూడా ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, తన సొంత సంస్థ 'తెలంగాణ జాగృతి'ని ఒక రాజకీయ వేదికగా మార్చి ప్రజల్లోకి వెళ్తానని వెల్లడించారు. 202829 ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# సహకారం ఏదీ..?

**మొదటిపేజీ తరువాయి**

సంస్థలు ఉన్నాయి. గతంలో 17 కార్పొరేషన్లు ఉండగా ప్రజాప్రభుత్వం కొత్తగా 13 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 30కి చేరింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు ఏటా భారీ ఎత్తున వార్షిక ప్రణాళికలు రూపొందిస్తుండగా వాటిని ప్రభుత్వం ఆమోదిస్తోంది. కానీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయట్లేదు. దీంతో నిర్దేశించిన కార్యక్రమాలన్నీ అటకెక్కుతున్నాయి. 2024-25 వార్షిక సంవత్సరం చివర్లో రాజీవ్ యువ వికాసాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి రూ. 6 వేల కోట్ల మేర నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.



అన్ని కార్పొరేషన్ల పరిధిలో ఈ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానించగా ఏకంగా 16 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. 2025-26 వార్షిక బడ్జెట్‌లో నిధులు విడుదల చేస్తామని మొదట్లో చెప్పుకొచ్చిన సర్కారు... రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటివరకు మంజూరు పత్రాల జాడ లేకపోగా కనీసం ఈ పథకంపై ఎలాంటి సమీక్ష నిర్వహించకపోవడం గమనార్హం.

మరోవైపు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా ఈ కార్పొరేషన్లు మారుతున్నాయనే విమర్శలున్నాయి. పదవుల పందేరంలో భాగంగా ఆయా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడం... వారికి నెలవారీ జీతభత్యాల కింద భారీగా నిధులు ఇవ్వడం వరకే కార్పొరేషన్లు పరిమితమవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో చైర్మన్‌కు జీతభత్యాల కింద ఏటా సగటున రూ. 50 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

**ఐదు కార్పొరేషన్లకే కార్యాలయాలు..**

బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 1974లో బీసీ కార్పొరేషన్ ఏర్పాటైంది. ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ పరిధిలో బీసీ కార్పొరేషన్‌తో పాటు ఎంబీసీ, రజక, నాయీ బ్రాహ్మణ, కల్లుగీత, వడ్డెర, సగర (ఉప్పర), వాల్మీకి/బోయ, భట్రాజ, విశ్వబ్రాహ్మణ, కృష్ణబలిజ/పూసల, కుమ్మరి/శాలివాహన, మేదర, ముదిరాజ్, గంగపుత్ర, మున్నూరు కాపు, లింగాయత్, యాదవ, మేర, పద్మశాలి, పెరిక కార్పొరేషన్లతోపాటు ఈబీసీ సంక్షేమ బోర్డు కొనసాగుతున్నాయి. ఇందులో కేవలం ఐదింటికి మాత్రమే చైర్మన్లున్నారు. పెద్ద సంఖ్యలో కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఐదింటికి మినహా మిగిలిన వాటికి కార్యాలయాలు సైతం లేవు. వాటిని బీసీ కార్పొరేషన్ కార్యాలయం నుంచే నిర్వహిస్తున్నారు.

ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయింది. ఈ కార్పొరేషన్‌ను మాల, మాదిగలకు వేర్వేరుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు ముందడుగు పడలేదు.

ఎస్టీ సంక్షేమ శాఖ పరిధిలోని ట్రైకార్‌ను మూడు కార్పొరేషన్లుగా ప్రభుత్వం మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివాసీల కోసం కుమురం భీం ఆదివాసీ కార్పొరేషన్, లంబాడాల కోసం సంత్ సేవాలాల్ లంబాడా కార్పొరేషన్, ఎరుకల వర్గానికి ఏకలవ్య కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసింది. వాటిలో ట్రైకార్ చైర్మన్ కొనసాగుతున్నప్పటికీ విభజించిన కార్పొరేషన్లకు నీడ కూడా లేదు. ఉద్యోగుల కేటాయింపు, కార్యాలయాల ఏర్పాటు ఊసే లేదు.

మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో ఒక కార్పొరేషన్ ఉండగా అందులో ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీలకు వేర్వేరుగా కార్యకలాపాలు సాగించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ముందడుగు పడలేదు.

వికలాంగుల సంక్షేమ శాఖ పరిధిలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ఉండగా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ కొనసాగుతోంది. వాటికి చైర్మన్లు ఉన్నారు.

# త్వరలోనే కవిత రాజకీయ పార్టీ ?

**మొదటిపేజీ తరువాయి**

పార్టీ ఏర్పాటేనా? మరి ఆ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయా? పార్టీ ఏర్పాటులో ఆమె ఏ ఫార్ములాను అనుసరించబోతున్నారు? ఎమ్మెల్సీ పదవికి గతంలోనే రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత తాజాగా సభలో అందుకు కారణాలను వివరించారు. తనకు బీఆర్ఎస్‌లో తీవ్రమైన అవమానాలు జరిగాయంటూ మొదలుపెట్టి...ఒక దశలో తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను కూడా టచ్ చేశారు. ఇక బీఆర్ఎస్‌కు నైతికత లేదంటూ సభ సాక్షిగా ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనం అవుతున్నాయి. ఇక చివరిగా... తాను ఇప్పుడు ఒక వ్యక్తిగా బయటకి వెళ్తున్నానని, భవిష్యత్తులో ఒక రాజకీయ శక్తిగా మళ్లీ వస్తానని అనడం చుట్టూ రకరకాల చర్చలు మొదలయ్యాయి. కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి కొత్త పార్టీ పెడతారని ప్రచారం జరుగుతోంది. కానీ... ఆమె మాత్రం ఎక్కడా అధికారికంగా ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో సోమవారం శాసనమండలిలో తన రాజీనామాను సమర్పిస్తూ చేసిన వ్యాఖ్యలు మాత్రం కొత్త పార్టీని కన్ఫామ్ చేసినట్టేనని అంటున్నాయి రాజకీయవర్గాలు. భవిష్యత్‌లో రాజకీయ శక్తిగా తిరిగి సభకు వస్తానని అనడం వెనక ఉద్దేశ్యం కొత్త పార్టీయేనని విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే కొత్త పార్టీ కోసం ఆమె ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. జాగృతి జనం బాట పేరుతో కొద్ది రోజులుగా జనంలోనే ఉంటున్నారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలు చుట్టి రావాలన్నది ఆమె ప్లాన్. కొత్త పార్టీ కోసం చేసే ప్రాథమిక కసరత్తులో భాగంగానే... జాగృతి జనం బాట అన్నది పరిశీలకుల మాట. ఇక మంగళవారం నాడు తెలంగాణ జాగృతి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు కవిత. రాష్ట్రస్థాయి కార్యవర్గంతో పాటు అనుబంధ సంఘాలు అన్నింటిని పిలిచి మాట్లాడారామె. ఈ సమావేశంలో చాలా కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటికే సగం జిల్లాలు చుట్టి వచ్చానని, ఆ టైంలో పార్టీ పెట్టాలన్న సూచనలు చాలా వచ్చాయంటూ మీటింగ్‌లో చెప్పారట ఆమె. తెలంగాణ జాగృతి త్వరలోనే ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా వెళ్తుందని సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. సంక్రాంతి తర్వాత మిగిలిన జిల్లాల పర్యటనలు చేయబోతున్నారు ఎమ్మెల్సీ. ఇప్పటివరకు జరిగిన టూర్ వేరు, ఇక రాబోయే జిల్లాల పర్యటన వేరు అంటున్నారు జాగృతి నేతలు.



సంక్రాంతి తర్వాత చేయబోయే జిల్లాల పర్యటనలో ఆమె పార్టీ ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ప్రకటనలు చేస్తారని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలుగా ఉన్న కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు తన తండ్రి అనుసరించిన విధానాన్నే ఫాలో అవబోతున్నట్టు తెలుస్తోంది. అప్పట్లో తెలంగాణ కోసం అసెంబ్లీలో మాట్లాడి రాజీనామా చేసి బయటకు వచ్చిన కేసీఆర్... జలదృశ్యంలో పార్టీ ప్రకటన చేశారు. అలాగే కవిత కూడా శాసనమండలిలో రాజీనామా కంటే ముందు ఉపన్యాసం ఇచ్చి బయట తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చి కచ్చితంగా పార్టీ పెడతానని చెప్పారు. ఇక పార్టీకి సంబంధించిన ఏర్పాట్లు, జెండా అజెండా పనిలో పడతాం అంటున్నారు కవిత అనుచరులు. ఇప్పటివరకు తెలంగాణ జాగృతి ఒక సంస్థ మాత్రమే ఉందని, అదే పేరుతో రాజకీయ పార్టీ వచ్చే అవకాశం కూడా ఉందని అంటున్నారు. కొత్త పార్టీ విధివిధానాలు ఎలా ఉంటాయో చూడాలి.

# కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు

- **దానం నాగేందర్, కడియం శ్రీహరి కాంగ్రెస్ లోకి వస్తారని ఎవరూ అనుకోలేదని వ్యాఖ్య**
- **కవిత కూడా కాంగ్రెస్‌లో చేరవచ్చని అభిప్రాయపడిన మల్‌రెడ్డి రంగారెడ్డి**
- **నాకు మంత్రి పదవి ఇవ్వండి అంటూ హైకమాండ్‌కు విజ్ఞప్తి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని అనుకోలేదని, కానీ వారు వచ్చారని చెప్పారు. కవిత కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

**తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న రంగారెడ్డి**

తనకు మంత్రి పదవి ఇవ్వాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం జరుగుతుందని అన్నారు. పార్టీ పెద్దలు తన విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంతవరకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లా పేరు మారుస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మల్‌రెడ్డి స్పందిస్తూ, పేరు మార్పు తనకు ఇష్టం లేదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని, జిల్లా పేరు మాత్రం మార్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ ఊపందుకుందని, భూముల ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఎవరూ అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదని ఆయన తెలిపారు.





# ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తహసీల్దార్

- **కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**
- **భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్**
- **ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన వైనం**
- **తహసీల్దార్, మధ్యవర్తిని అరెస్ట్ చేసిన అధికారులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లాలో ఓ తహసీల్దార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి రూ.50,000 లంచం స్వీకరిస్తుండగా మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒక వ్యక్తి తన తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో అనుకూలంగా నివేదిక పంపేందుకు తహసీల్దార్ శ్రీనివాసరావు రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని చిన్నూరి అజయ్ అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా తనకు అందజేయాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. బాధితుడు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అజయ్ ద్వారా డబ్బులు అందజేస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనం పూసిన నోట్లను స్వాధీనం చేసుకుని, వారి చేతులను పరీక్షించగా పాజిటివ్ రిజల్ట్ వచ్చింది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన అజయ్‌ను కూడా ఏసీబీ అరెస్ట్ చేసింది. అనంతరం ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ (9440446106), ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ సర్కారులో బీఆర్ఎస్ కోవర్టులు

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన పాలసీ హిల్ట్. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పేరుతో... పారిశ్రామిక వాడల్లో మల్టీ పర్పస్ జోన్స్ అభివృద్ధికి ఉద్దేశించిన విధానం అది. నగర అభివృద్ధిలో ఇదో మైలురాయిగా నిలిపోతుందని ప్రభుత్వం భావిస్తుండగా... అసలా పాలసీ పూర్తి స్థాయిలో రూపు దిద్దుకోక ముందే వివరాలు, బ్లూ ప్రింట్ మొత్తం ప్రతిపక్షం బీఆర్ఎస్ చేతికి చేరింది. కొంతమంది మంత్రుల కంటే ముందుగా వివరాలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలియడం, ఆయన మీడియా సమావేశం పెట్టి ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడంతో షాకయ్యారు ప్రభుత్వ పెద్దలు. ఇక సీఎం రేవంత్ రెడ్డి అయితే...దీనిపై తీవ్ర అసహనానికి గురయ్యారు. మేటర్ అసలు మంత్రివర్గంలో చర్చకు రాక మునుపే బీఆర్ఎస్ వాళ్ళ చేతికి ఎలా చేరిందో తేల్చమని విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించారాయన. స్వయంగా ముఖ్యమంత్రే సీరియస్ అయిపోవడంతో... అలర్ట్ అయిన దర్యాప్తు అధికారులు బాగా లోతుల్లోకి వెళ్ళి పూర్తి వివరాలు సేకరించి ఓ డిటైల్డ్ రిపోర్ట్‌ని ప్రభుత్వానికి అందజేశారట. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నత స్థానంలోనే కోవర్టులు ఉన్నారంటూ ఆ రిపోర్ట్‌లో ఉందన్న వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించిన నివేదికలో పలు కీలకమైన అంశాలను ప్రస్తావించినట్టు తెలుస్తోంది. హిల్ట్ పాలసీ సమాచారాన్ని ముందే ప్రతిపక్షానికి లీక్ చేసిన వ్యవహారంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులతో సహా నలుగురు ఆఫీసర్స్ పాత్ర ఉన్నట్టు విజిలెన్స్ గుర్తించిందట.

విజిలెన్స్ రిపోర్ట్‌లో పేరుందని ప్రచారం జరుగుతున్న ఓ ఐఏఎస్ ఇప్పటికే ప్రభుత్వ పెద్దల్ని కలిసి అందులో తన పాత్రేమీ లేదని వివరణ ఇచ్చుకున్నట్టు కూడా సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కి చెందిన ఇద్దరు అధికారుల ప్రమేయంపై విచారణ జరుగుతుండగా, ఇటీవల అదే శాఖలోని మరో అధికారిని బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. హిల్ట్ పాలసీపై కొద్ది రోజులుగా రాజకీయ దుమారం నడుస్తోంది. దీని ద్వారా దాదాపు 5 లక్షల కోట్ల రూపాయల భూ దోపిడీకి తెర తీశారంటూ బీఆర్ఎస్, బీజేపీ తీవ్రంగా విమర్శిస్తున్నాయి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి అతి పెద్ద అవినీతికి తెరలేపారంటూ డైరెక్ట్‌గా టార్గెట్ చేస్తున్నారు విపక్ష నాయకులు. దాంతో సీరియస్‌నెస్ పెరిగిపోయింది. అసలు ప్రాథమిక దశలోనే వివరాలు విపక్షానికి లీక్ అవడంతో... ప్రభుత్వంలో ప్రతిపక్ష కోవర్ట్‌ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అయింది. హిల్ట్ పాలసీ ముసాయిదా లీకు కావడంపై తొలుత పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ ఉన్నతాధికారులను అనుమానించారు. వాళ్ళలో ఎవరో ఒకరు ఈ నిర్వాకానికి ఒడిగట్టారని, ముసాయిదా ప్రతిని హార్డ్ కాపీ రూపంలో పంపించారని అంచనాకు వచ్చారు.



దాంతో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారుల్లో బీఆర్ఎస్ కు అనుకూలంగా ఉన్నవారు ఎవరంటూ ఆరా తీసి, వారి కదలికలపై నిఘా పెట్టారు. అదే సమయంలో పాలసీ డ్రాఫ్ట్ లీకేజీపై మంత్రివర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరిగినట్లు తెలుస్తోంది. క్యాబినెట్ లో జరిగిన నిర్ణయాలు వెంటనే ప్రతిపక్షాలకు వెళ్లాడాన్ని ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. దాంతో అన్ని మార్గాల్లో కూపీ లాగిన విజిలెన్స్ ఫైనల్‌గా పరిశ్రమల శాఖకు చెందిన ఇద్దరు, ముగ్గురు అధికారుల ద్వారానే సమాచారం లీక్ అయినట్టు నిర్ధారణకు వచ్చింది. అయితే... ఇంటి దొంగలెవరో తెలిసిపోయింది. ఇక వారి విషయంలో ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందన్నది ఉత్కంఠగా మారింది. ప్రతిపక్షానికి ప్రభుత్వ సమాచారం చేరవేయడాన్ని సీరియస్‌గా తీసుకుని వాళ్ళని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తుందా? లేక శాఖపరమైన చర్యలు తీసుకుంటా అన్నది చూడాలి.

# టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు

- **సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చిన జగ్గారెడ్డి**
- **మున్సిపల్ ఎన్నికల ప్రచారాని తనను పిలవొద్దన్న జగ్గారెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావొద్దని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవొద్దని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో ఎమ్మెల్యే కానున్న నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని సూచించారు. జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు. ఆమె గెలుపు కోసం చేసే వాగ్దానాలన్నీ తానే నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. తన జీవితంలో తాను పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తాను ఎప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు.

అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డు పెట్టుకుని గెలవాలని చూడవద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూస్తే వారిపై వేటు ఖాయమని హెచ్చరించారు.

# భవిష్యత్ తరాల కోసమే హిల్ట్ పాలసీ

మొదటిపేజీ తరువాయి

ఆయన పేర్కొన్నారు.
హిల్ట్ పాలసీపై వస్తున్న విమర్శలను ప్రభుత్వం భయపడటం లేదని, సద్విమర్శలు ఉంటే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు. అయితే పాలసీ గురించి పూర్తిగా తెలియకుండా, వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. ''హిల్ట్ పాలసీని కేవలం భూముల మార్పిడిగా చూడటం తప్పుడు ఆలోచన. ఇది నగర భవిష్యత్‌ను నిర్ణయించే కీలక విధానం'' అని శ్రీధర్‌బాబు అన్నారు.
హిల్ట్ పాలసీ ద్వారా ప్రస్తుతం నగర పరిధిలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలను క్రమంగా నివాస ప్రాంతాలుగా మార్చే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో పరిశ్రమల కారణంగా పెరుగుతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిని మార్చాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) లోపలి ప్రాంతాల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు.
నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలి వైపునకు తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శ్రీధర్‌బాబు తెలిపారు. పరిశ్రమలు నగరానికి దూరంగా ఏర్పాటవ్వడం వల్ల నివాస ప్రాంతాల్లో కాలుష్యం తగ్గుతుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని ఆయన అన్నారు. ఇది కేవలం ప్రస్తుత తరానికి మాత్రమే కాకుండా రాబోయే తరాలకూ ఉపయోగపడే నిర్ణయమని స్పష్టం చేశారు.
హిల్ట్ పాలసీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆలోచన కాదని మంత్రి గుర్తు చేశారు. ఈ పాలసీపై గత కొంతకాలంగా విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయని, వివిధ వర్గాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక వృద్ధి అన్నింటికీ సమతుల్యత సాధించాలన్న ఉద్దేశంతోనే ఈ పాలసీ రూపొందించామని ఆయన వివరించారు.
హిల్ట్ పాలసీ అమలుకు అవసరమైన వనరుల సమీకరణలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. భూముల మార్పిడి ప్రక్రియలో ఎవరికీ అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు భూముల కన్వర్షన్ ప్రక్రియను సులభతరం చేస్తామని స్పష్టం చేశారు. ఇది బలవంతపు చర్య కాదని, పరస్పర అంగీకారంతో జరిగే విధానమని ఆయన తెలిపారు.
హిల్ట్ పాలసీపై వస్తున్న కొన్ని ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. పారిశ్రామికవేత్తల భూములను ప్రభుత్వ భూములుగా ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని ఆయన అన్నారు. ఈ అంశంపై వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ''భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని పాటిస్తోంది. ఎలాంటి అక్రమాలు, దురుద్దేశాలు లేవు'' అని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.
జీవో ఎంఎస్ 19 అంశాన్ని ప్రస్తావించిన మంత్రి, లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయని గత ప్రభుత్వమే ఆ జీవో తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని విస్మరించి, ప్రస్తుత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం రాజకీయ దురుద్దేశంతో చేసిన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం చట్టబద్ధంగానే ముందుకు వెళ్తోందని, ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం లేదని చెప్పారు.
నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే హిల్ట్ పాలసీ ప్రధాన లక్ష్యమని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. నగర అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారుల నిర్మాణం మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్యం, జీవన నాణ్యత కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. అందుకే ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో హేతుబద్ధత, శాస్త్రీయత ఉండేలా చూస్తున్నామని చెప్పారు.
హిల్ట్ పాలసీ అమలుతో నగరంలో మెరుగైన నివాస ప్రాంతాలు ఏర్పడతాయని, పచ్చదనం పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కాలుష్య రహిత వాతావరణంలో ప్రజలు జీవించే అవకాశం కలుగుతుందని తెలిపారు. పరిశ్రమలకు కూడా అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుకూల వాతావరణం ఓఆర్ఆర్ అవతల కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.
భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసు



కోవడమే తమ ప్రభుత్వ విధానమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తక్షణ రాజకీయ లాభాల కోసం కాకుండా, దీర్ఘకాల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని హిల్ట్ పాలసీని అమలు చేస్తున్నామని అన్నారు. ఈ పాలసీపై ప్రజలు సరైన సమాచారం తెలుసుకుని తమ అభిప్రాయాలు వెల్లడించాలని ఆయన కోరారు.
మొత్తానికి, హిల్ట్ పాలసీ హైదరాబాద్ నగర భవిష్యత్ రూపురేఖలను మార్చే కీలక నిర్ణయమని మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో స్పష్టంగా వివరించారు. కాలుష్య నియంత్రణ, నగర అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం అన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించింది.



## అసెంబ్లీ గౌరవ సభలా లేదు..
# కౌరవ సభ లా ఉంది..

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీదేనని, కానీ ఆయన తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం ద్రోహం చేసి రేవంత్ రెడ్డి చెంతకు చేరారని మండిపడ్డారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత స్థాయిలో తీవ్ర విమర్శలు చేస్తూ, ఆయనకు కనీస భౌగోళిక అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. దేవాదుల ప్రాజెక్టు గోదావరిపై ఉందో, కృష్ణాపై ఉందో తెలియని పరిస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని, బక్రా నంగల్ ప్రాజెక్టు ఎక్కడ ఉందో కూడా తెలియనివాడు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రెండేళ్ల పాలనలో సిగ్గులేని మాటలు, రోత కోతలు తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను ఉరితీయాలని అనడంపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. “చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరివేస్తావా?” అని ప్రశ్నిస్తూ, 70 లక్షల మంది రైతులను మోసం చేసిన రాహుల్ గాంధీని ఉరితీయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఒక లీడర్ కాదని, కేవలం ‘రీడర్’ అని, ఇక్కడి నాయకులు ఏమి రాసిస్తే అది చదవడమే ఆయన పని అని ఎద్దేవా చేశారు.
కాంగ్రెస్‌లో సీనియర్లను తొక్కేసి, అడ్డదారిలో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి, అసెంబ్లీలో , బయటా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.
చివరకు తన గన్‌మెన్‌పై కూడా చేయి చేసుకునే స్థాయికి ముఖ్యమంత్రి దిగజారారని, ఆయన పరిస్థితి చూస్తుంటే పిచ్చి పట్టినట్లు ఉందని, రేవంత్ రెడ్డి భార్య గీతమ్మ ఆయన్ను కట్టేయాలని, లేకపోతే ఎవరినైనా కరిచే ప్రమాదం ఉందని సెటైర్లు వేశారు. తాను చదువుకున్న వ్యక్తిని అని, రేవంత్ రెడ్డి హవాలా తిరుగుడు తిరిగిన వ్యక్తని ఎద్దేవా చేస్తూ, భవిష్యత్తులో ఆయన మనవడు కూడా ఆయన్ను దేకడని శాపనార్థాలు పెట్టారు. కేసీఆర్ కాలి గోటికి కూడా రేవంత్ రెడ్డి సరిపోరని, గతంలో కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వారే ఇంతకంటే ఎక్కువ మాట్లాడి కాలగర్భంలో కలిసిపోయారని, రేవంత్ పరిస్థితి కూడా అంతేనని హెచ్చరించారు. ప్రస్తుతం అసెంబ్లీ గౌరవ సభలా లేదని, కౌరవ సభలా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఒకే ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే ముఖ్యమంత్రికి భయం పట్టుకుందని, అందుకే ఇటువంటి అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్ జనగామ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.





## సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు స్పందించిన సర్పంచ్...

- **పెన్షన్ ఆన్లైన్ చేయించి ఓ ఆడబిడ్డ ఆవేదన తీర్చిన సర్పంచ్ కిషోర్ నాయక్...**

**బూర్గంపహాడ్ జనవరి 06(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక మేజర్ గ్రామపంచాయతీ లోని విజయ నగర్ కాలనీకి చెందిన బొగ్గ అశ్విని పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందంటున్న పరిస్థితిని స్థానికులు ద్వారా తెలుసుకొని చలించిపోయి, పేద ప్రజలకు నిత్యం అండగా ఉంటూ, ప్రజా సేవకు అంకితమై, ఇన్ఫెక్షన్ డిసీజ్ వచ్చి నడవలేని స్థితిలో కుటుంబానికి భారంగా మారిన ఆ మహిళకు గవర్నమెంట్ ద్వారా వచ్చే పెన్షన్ ఆసరాగా మారుతుందని అనుకున్న కుటుంబ సభ్యుల ఆశ ను వెంటనే నెరవేర్చిన సారపాక గ్రామపంచాయతీ యువ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్. తెలంగాణ గవర్నమెంట్ ద్వారా డిసేబిలిటీ సర్టిఫికెట్ వచ్చి సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు పెన్షన్ కి నోచుకోలేని ఈ ఆడబిడ్డ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని స్థానిక ఎంపీడీవో తో ప్రత్యేకంగా మాట్లాడి చొరవ చూపించి పెన్షన్ ఆన్లైన్ చేయించి వచ్చే ఫిబ్రవరి నుండి తనకు ఆసరా పెన్షన్ అందించాలని కోరారు.సారపాక స్థానిక ప్రజలు నమ్మి గెలిపించిన సర్పంచ్ ప్రజల మనిషిగా తన ఔదార్యాన్ని చాటుకొని సారపాక మేజర్ గ్రామపంచాయతీలోని ఇలాంటి స్థానిక ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యల పట్ల పట్టుదలతో అందరి మన్ననలను పొందుతున్న కిషోర్ నాయక్ ను పలువురు రాజకీయ విశ్లేషకులు, ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

## యూరియా కొరతతో రైతుల కష్టాలు

**చిగురుమామిడి, జనవరి 06(ప్రజాస్వరం):**

మండల కేంద్రంలోని పలు గ్రామాలలో యూరియా కొరతతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు పాస్ బుక్కులు పెట్టి లైన్ కట్టి రోజు మొత్తం ఉంటే రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారు రైతులను ఇబ్బందులకు గురిచేయద్దని అధికారులను రైతులు కోరుకుంటున్నారు రైతులకు సరైన సమయంలో యూరియా అందించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.



## ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద
# సబ్సిడీ ఇస్తుందా?

- **కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలన్న కాటిపల్లి**
- **ఈవీల వినియోగం పెంచేందుకు కేంద్రం సబ్సిడీ ఇస్తోందని వెల్లడి**
- **రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కీలక సూచనలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) వినియోగించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.
ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏమైనా ప్రోత్సాహకాలు అందిస్తోందా అని ఆయన ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్ల కొరత కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈవీల వినియోగం తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు.



తెలంగాణలో ప్రస్తుతం కేవలం 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయింపు వంటి ప్రోత్సహకాలను ప్రభుత్వం అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈవీలను ఉపయోగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.
అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని బీజేపీకి చెందిన మరో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చాలంటే ఈవీల వినియోగం తప్పనిసరి అని ఆయన అన్నారు. ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించడానికి పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

## ఐఐటీహెచ్ ఎయిర్ టాక్సీ వచ్చేసింది!

- **హైదరాబాలో ట్రాఫిక్ కష్టాలకు ఇక ‘టాటా’**
- **ఐఐటీ హైదరాబాద్ నుంచి ఎయిర్ టాక్సీ బ్రేక్‌థ్రూ**
- **ట్రాఫిక్‌కు గుడ్‌బై.. గాలిలో ప్రయాణం**
- **పైలట్ అవసరం లేని స్మార్ట్ ఎయిర్ టాక్సీ**
- **ఎమర్జెన్సీ వైద్యంలో గేమ్ చేంజర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణం అంటేనే ఒక యుద్ధం. ఆఫీస్‌కు వెళ్లాలన్నా, ఇంటికి రావాలన్నా కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లు..గంటల తరబడి సిగ్నల్ దగ్గర నిరీక్షణ. కానీ, త్వరలోనే మనం ఈ రోడ్లపై పాకాల్సిన అవసరం లేదు.. పక్షుల్లా గాలిలో ఎగురుతూ గమ్యస్థానానికి చేరుకోవచ్చు! అవును, మీరు విన్నది నిజమే. IIT హైదరాబాద్ (IITH) పరిశోధకులు పట్టణ ప్రయాణ ముఖచిత్రాన్ని మార్చేసే ఒక అద్భుతమైన ‘ఎయిర్ టాక్సీ’ (Air Taxi) ప్రోటోటైప్‌ను సిద్ధం చేశారు.

**ఇది కేవలం ‘టాక్సీ’ కాదు..**
**భవిష్యత్తు ప్రయాణం.!**

సంగారెడ్డి జిల్లా కందిలోని IIT హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. ఫ్యాకల్టీ సభ్యులు దీపక్ జాన్ మాథ్యూ, ఆయన సహచరుడు కేతన్ చతుర్మత కలిసి రూపొందించిన ఈ సూపర్ ఎయిర్ ట్యాక్సీ భవిష్యత్తులో మన రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపబోతోంది.

**ఈ ఎయిర్ టాక్సీ ప్రత్యేకతలు ఏంటి?**

సూపర్ స్పీడ్: ఈ టాక్సీ గంటకు 60 నుండి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు. అంటే రోడ్డు మీద గంట పట్టే ప్రయాణం, గాలిలో కేవలం 1015 నిమిషాల్లోనే పూర్తవుతుంది.
బరువు మోసే సామర్థ్యం: ఇది దాదాపు 120 కిలోల బరువును (పేలోడ్) సునాయాసంగా మోసుకెళ్లగలదు.
పైలట్ అవసరం లేదు: ఇది పూర్తిగా ఆటోమేటెడ్ వ్యవస్థ. ముందుగా ప్రోగ్రామ్ చేసిన నావిగేషన్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ప్రయాణికులు కూర్చుంటే చాలు, మాన్యువల్ సాయం లేకుండానే అది మనల్ని సురక్షితంగా గమ్యానికి చేరుస్తుంది.

**ప్రాణాలను కాపాడే ‘ఏంజిల్’**

ఈ ఎయిర్ టాక్సీ కేవలం ఆఫీసులకు వెళ్లడానికే కాదు, అత్యవసర వైద్య సేవల్లోనూ విప్లవం తీసుకురానుంది. ముఖ్యంగా అవయవ మార్పిడి (Organ Transplant) సమయంలో మానవ అవయవాలను ఒక ఆసుపత్రి నుండి మరో ఆసుపత్రికి నిమిషాల వ్యవధిలో చేర్చడానికి ఇది సంజీవనిలా పనిచేస్తుంది. ట్రాఫిక్ వల్ల ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రాణాలు పోయే స్థితిలో, ఈ ఎయిర్ టాక్సీ ‘గ్రీన్ ఛానల్’ కంటే వేగంగా పనిచేస్తుంది.

**రోడ్లపై ఎప్పుడు ఎగురుతుంది?**

ప్రస్తుతం ఈ ప్రోటోటైప్ పరీక్షల దశలో ఉంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) నుండి అనుమతులు రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 లేదా 2027 నాటికి ఈ ఎయిర్ టాక్సీలు వాణిజ్యపరంగా మనకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మనం సినిమాల్లో చూసే సైన్స్ ఫిక్షన్ దృశ్యాలు త్వరలోనే హైదరాబాద్ గగనతలంపై నిజం కాబోతున్నాయి. రోడ్లపై హారన్ల గోల, కాలుష్యం నుండి తప్పించుకుని.. హాయిగా గాలిలో ప్రయాణించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్, ముఖ్యంగా మన తెలంగాణ గడ్డపై ఉన్న IIT హైదరాబాద్ సాధించిన ఈ విజయం గర్వించదగ్గ విషయం..

# రూ.8000 కోట్లతో ఓఆర్ఆర్ చుట్టూ వాటర్ గ్రిడ్!

మొదటిపేజీ తరువాయి

సన్నాహాలు చేస్తున్నారు.

**ప్రస్తుత సమస్యలకు శాశ్వత పరిష్కారం**

ప్రస్తుతం హైదరాబాద్‌లో పాక్షికంగా లీనియర్ పైప్‌లైన్ వ్యవస్థ అమల్లో ఉంది. దీనివల్ల ప్రధాన పైప్‌లైన్‌లో ఎక్కడైనా మరమ్మతులు వచ్చినా లేదా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా, ఆ లైన్‌పై ఆధారపడిన లక్షలాది మందికి గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోంది. ఉదాహరణకు, ఎల్బీ నగర్ జోన్‌లోని కొన్ని ప్రాంతాలు అక్కంపల్లి రిజర్వాయర్‌పైనే ఆధారపడటంతో 3 నుంచి 4 రోజులకు ఒకసారి మాత్రమే నీటిని పొందుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించి, నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ రింగ్ మెయిన్ వ్యవస్థను ప్రతిపాదించారు. కోటిన్నర జనాభాకు చేరువవుతున్న నగరానికి ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది.

**ప్రాజెక్ట్ స్వరూపం ఇదే**

ఈ ప్రాజెక్టులో భాగంగా ఓఆర్ఆర్ చుట్టూ 140 కిలోమీటర్ల పొడవునా ప్రధాన పైప్‌లైన్ (రింగ్ మెయిన్) నిర్మిస్తారు. దీనికి అనుబంధంగా, ఓఆర్ఆర్‌కు సమీపంలోని అంతర్గత ప్రాంతాలకు నీటిని చేరవేసేందుకు 98 కిలోమీటర్ల పొడవైన రేడియల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ ద్వారా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న ఐదు ప్రధాన వనరులైన గోదావరి, కృష్ణా, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను పరస్పరం అనుసంధానిస్తారు."ఈ అనుసంధానం వల్ల నగరంలోని ఏ ప్రాంతమూ కేవలం ఒకే నీటి వనరుపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఒక మార్గంలో సరఫరాకు అంతరాయం కలిగితే, తక్షణమే మరో మార్గం నుంచి నీటిని మళ్లించి సరఫరాను స్థిరీకరించవచ్చు. ఇది మొత్తం సరఫరా వ్యవస్థకు భరోసా ఇస్తుంది" అని జలమండలికి చెందిన ఒక సీనియర్ అధికారి వివరించారు. ఇదే సమయంలో, మంజీరా, ఉస్మాన్‌సాగర్ సరఫరా నెట్‌వర్క్‌ల ఆధునికీకరణకు రూ.1,000 కోట్లతో పనులు చేపడుతున్నామని, దీనివల్ల నీటి నష్టాలను తగ్గించి, నాణ్యతను పెంచవచ్చని ఆయన తెలిపారు.ఈ డీపీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది. గోదావరి ఫేజ్II ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే 2027 నాటికి ఈ రింగ్ మెయిన్ ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని జలమండలి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నీటి సరఫరా వ్యవస్థలో ఇదొక విప్లవాత్మక మార్పు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# అభివృద్ధి పట్ల ఎమ్మెల్యేకు విజన్ ఉంది

- 84.24 కోట్ల నిధులతో పట్టణ అభివృద్ధి
- గత పాలకుల నిధులు కాగితాలకే పరిమితం
- మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



**మెదక్, జనవరి 06 (ప్రజా స్వరం) :**

మెదక్ పట్టణంను సుందర నందన వనంగా తీర్చిదిద్దడమే యువ ఎమ్మెల్యే గొప్ప సంకల్పం తో ముందుకు సాగుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. గత సర్కార్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినప్పటికి రేవంత్ రెడ్డి తన నాయకత్వంలో అభివృద్ధి వైపు పయనించే విధంగా ముందుకు తీసుకుని వెళ్తున్నారని అన్నారు. మెదక్ ను సుందర నందన వనంగా తీర్చిదిద్దడమే యువ ఎమ్మెల్యే గొప్ప సంకల్పం తో ముందుకు సాగుతున్నారని అన్నారు. గతంలో పట్టణంలో నిర్మించాల్సిన పిట్లం చెరువు కట్టను అసంపూర్తిగా ఆపేయడం జరిగిందని, పట్టణంలో కొత్తగా ఒక్క కల్వర్టు నిర్మించాలేక పోయారని అన్నారు. గతంలో మెదక్ అభివృద్ధి పేరిట గత సర్కార్ కాగితాలు మాత్రమే రిలీజ్ చేసిందనీ, నిధులు మంజూరు చేయడం మార్చారని గుర్తు చేశారు. మెదక్ అభివృద్ధి చేసేందుకు సీఎం ను ఎమ్మెల్యే కలిసి నిధులు కోరగానే సానుకూలంగా స్పందించి 84.24 కోట్లు మంజూరు చేయడం జరిగిందనీ అన్నారు. ఈ నిధులతో ప్రతి వార్డులో సుమారు 2 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి లు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభం అవ్వనున్నాయని అన్నారు. గత పదేండ్లలో మెదక్ అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. యువ ఎమ్మెల్యే మెదక్ ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తూ, మెదక్ రూపురేఖలు మార్చేందుకు పెద్ద మొత్తంలో నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే సఫలికృతులయ్యారని అన్నారు. కొత్తగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ను నిర్మాణం సైతం చేయనున్నారు. పట్టణంలో రెండు కేబుల్ బ్రిడ్జిలు ఏర్పాటు, ఏడ్యూకేషన్ హాబ్, వ్యాపార రంగాన్ని ఎంకరేజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి చేయడంలో యువ ఎమ్మెల్యే కు ఒక విజన్ ఉందని అన్నారు. గతంలో ఏడుపాయల, చర్చ్ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించి, పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. మెదక్ మున్సిపల్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఇంత పెద్ద నిధులు రావడం మొదటి సారి అది యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ గొప్పతనం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, మాజీ కౌన్సిలర్స్ దొంతి ముత్యం గౌడ్, కృష్ణ, మేడి మధుసూదన్ రావు, వసంత్ రాజ్, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు గౌడ్, బొజ్జ పవన్, దయాసాగర్, చింతల శ్రీను, ప్రవీణ్, స్వరూప, ఉమర్, అమీర్, రమేష్, గోదాల కృష్ణ, దేవుల పాల్గొన్నారు.



## పద్మాదేవేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు

**మనోహరాబాద్, ( ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిని మనోహరాబాద్ మండలం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కలిసిన వారిలో మనోహరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పురం మహేష్, రంగయపల్లి మాజీ సర్పంచ్ నాగభూషణం, జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు రేణు కుమార్, కొండాపూర్ మాజీ ఉపసర్పంచ్ నూకల వెంకటేష్ తదితరులు ఉన్నారు

# ఘనంగా యువ పార్లమెంట్ పోటీలు

**వర్గల్ / గజ్వేల్ (ప్రజాస్వరం) :**

జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్, సిద్దిపేట జిల్లాలో 27వ జాతీయస్థాయి యువ పార్లమెంట్ పోటీలు ఘనంగా మరియు విజయవంతంగా నిర్వహింపబడ్డాయని ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ గారు తెలియజేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు గౌరవ అతిథిగా హాజరయ్యారు. నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ కార్యాలయం సహాయ సంచాలకులు చక్రపాణి విచ్చేశారు. ఇతర అతిథులుగా నవోదయ విద్యాలయ సమితి ,భోపాల్ రీజియన్ ప్రాంతీయ కార్యాలయం సహాయ సంచాలకులు, దేవేందర్ కుమార్ విచ్చేశారు.భారత ప్రభుత్వ పార్లమెంటరీ మంత్రిత్వ శాఖ నుంచి అనిల్ కుమార్ డిప్యూటీ సెక్రటరీ విచ్చేశారు. ఈ పోటీల్లో జవహర్ నవోదయ విద్యాలయ, వాల్సాట్ గుజరాత్ రాష్ట్రం టీం మరియు జవహర్ నవోదయ విద్యాలయ, కొల్లం కేరళ టీం పాల్గొన్నాయి. మొదటగా జవహర్ నవోదయ విద్యాలయ valsad టీం తమ ప్రదర్శన ఇచ్చింది సుమారు 55 నిమిషాల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో అన్ని అంశాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. యువ పార్లమెంట్ సభ్యులు తమ చర్చల్లో విద్యా విధానంపై ,రైల్వే దుర్ఘటనలపై, లోక్ సభ మరియు అసెంబ్లీకి జరిగే జమిలి ఎన్నికలపై ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావించారు. జీరో అవర్లో పర్యావరణ సమస్యలపై, నీటి కాలుష్యంపై ప్రస్తావన జరిగింది.విద్యా బిల్లుపై సమగ్రంగా చర్చ జరిగి సభలో ఆమోదింపబడింది. జవహర్ నవోదయ విద్యాలయ కొల్లం టీం తమ ప్రదర్శనలో ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పై సంతాప తీర్మానం ప్రవేశపెట్టడం అయినది .ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా పరీక్షా విధానాలపై, భారత దేశ విదేశాంగ విధానంపై, రైతుల సమస్యలపై సమగ్రంగా ప్రశ్నలు మరియు వివరణలు జరిగాయి .జీరో అవర్లో విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల అవస్థ గురించి ప్రస్తావించడమైనది. అదేవిధంగా మహిళ రిజర్వేషన్ బిల్ పై విస్తారంగా చర్చ జరిగి సభలో ఆమోదింపబడింది. రెండు జట్ల నుంచి 8 మంది చొప్పున ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థిని విద్యార్థులనుఎంపిక చేయడమైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు మాట్లాడుతూ తప్పకుండా ఏదో ఒక రోజు నిజజీవితంలో కూడా ఈ యువ పార్లమెంట్ సభ్యులు ప్రజాప్రతినిధులు కావాలని ఆకాంక్షించారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో సంపూర్ణ వికాసానికై ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు .జాతీయ స్థాయికి ఎంపిక కాబోయే జట్టుకు ఆయన తన అభినందనలు ముందుగానే తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో శ్రీ దేవేందర్ కుమార్ సింగ్, సహాయ సంచాలకులు మాట్లాడుతూ ఇరుజట్ల ప్రదర్శన అత్యుత్తమంగా ఉందని చెప్పారు. శ్రీ అనిల్ కుమార్ డిప్యూటీ సెక్రటరీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖ,భారత ప్రభుత్వం వారు తమ సందేశంలో ఇరుజట్లకు కొన్ని సూచనలు చేయడమైనది .పార్లమెంటరీ విధానము ఏ విధంగా ఉంటుందో నిజమైన లోక్సభ రాజ్యసభలో చర్చలు ఏ విధంగా ఉంటాయో క్షుణ్ణంగా వ్యవహరిస్తూ చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దారు. గౌరవ అతిథిగా వచ్చేసిన శ్రీ బి చక్రపాణి ,సహాయ సంచాలకులు ,నవోదయ విద్యాలయ సమితి ,హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం వారు తన సందేశంలో ఇరువురు జట్లను మనసారా అభినందించారు. ఈ పోటీలను చక్కగా నిర్వహించినందుకు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థిని విద్యార్థులను మనసారా ప్రశంసించారు. ఇటువంటి చక్కటి కార్యక్రమాల ద్వారా విద్యార్థిని విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అల్లబడుతాయనిnఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. తనను గౌరవ అతిథిగా ఆహ్వానించినందుకు ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో శ్రీ బొల్లిపల్లి తిరుపతి రెడ్డి గారు బిజెపి మండల ప్రెసిడెంట్, వర్గల్ గ్రామస్తులు, ప్రెస్ మిత్రులు మరియు ఇతరులు ఈ పోటీలను తిలకించి ఒక చక్కటి అనుభూతికి లోనయ్యారు. తమ విద్యాలయంలో ఈ జాతీయస్థాయి పోటీ విజయవంతంగా నిర్వహింపడం పట్ల శ్రీ దాసి రాజేందర్ గారు ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికి తమ ధన్యవాదాలు మరియు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.





## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు

**మెదక్ జనవరి 06 (ప్రజా స్వరం) :**

“రోడ్డు సురక్ష అభియాన్ 2026” కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ పట్టణం ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లాడ్స్ నాగరాజు మాట్లాడుతూ మన జీవితంలో రోడ్డు భద్రత చాలా ముఖ్యమైనదని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయని అన్నారు. మనం రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలన్నారు. వాహనాల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్‌స్‌ను పాటించడం మన బాధ్యత అన్నారు. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రత నియమాలు తెలుసుకొని పాటిస్తే మన ప్రాణాలు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశం పాల్గొన్నారు.



## కబ్జాకు గురైన చెరువులు, కుంటలను కాపాడాలి

### గ్రామ సభలో గ్రామస్థుల ఫిర్యాదు

**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :**

అక్రమంగా గ్రామ పరిధిలో గల చెరువులు కుంటలు కబ్జాకు గురయ్యాయని వాటిని వెంటనే కాపాడాలి అని గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు.మంగళవారం నాడు ముప్పిరెడ్డిపల్లి లో సర్పంచి కందల రాజనర్సింహ ఈఓ రమేష్ పలకవరం తో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్థులు చెరువులు కుంటలు కాపాడాలి అని వినతి పత్రం అందజేశారు.

# రహస్య చెక్కుల వెనుక హెటెరో కుట్ర

- కేవీపీసీ ఆరోపణలు
- కాలుష్యానికి ప్రభుత్వ పత్రాలే సాక్ష్యమంటూ నిలదీత



**దోమడుగు, జనవరి 06 (ప్రజా స్వరం) :**

దోమడుగు గ్రామ పరిధిలోని నల్లకుంట చెరువు కాలుష్యానికి తమకు ఎలాంటి సంబంధం లేదని హెటెరో డ్రగ్స్ యాజమాన్యం చెబుతున్న మాటలు పచ్చి అబద్ధమని కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ (KVPC) ఆరోపించింది. కాలుష్య నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి అధికారులతో కుమ్మక్కై రైతులకు రహస్యంగా చెక్కులు పంపిణీ చేస్తున్న కుట్రను బట్ట బయలు చేస్తున్నామని కమిటీ పేర్కొంది. ప్రభుత్వ మరియు కోర్టు పత్రాల ప్రకారం హెటెరో కంపెనీ వల్లే నల్లకుంట చెరువు కాలుష్యం జరిగిందని స్పష్టంగా రుజువైందని KVPC వెల్లడించింది. 2012 అక్టోబర్ 3, 5 తేదీల్లో కాలుష్య నియంత్రణ మండలి (PCB) అధికారులు సేకరించిన నమూనాల (Sample No. 2147) ల్యాబ్ రిపోర్టులో చెరువు నీరు ‘పింక్’ రంగులో ఉందని అధికారికంగా నమోదైందని గుర్తు చేశారు. కాలుష్యం లేకుంటే నీరు పింక్ రంగులోకి ఎలా మారుతుందని ప్రశ్నించారు. ఇదే విషయంపై 30 032013న PCB జారీ చేసిన ఆర్డర్ నెం.953 ప్రకారం నల్లకుంట చెరువులోని కలుషిత నీటిని హెటెరో కంపెనీయే తన సొంత ఖర్చుతో శుభ్రం చేయాలని ఆదేశించిందని తెలిపారు. సంబంధం లేకపోతే కంపెనీ ఎందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి చెరువు నీటిని ఎత్తిపోసిందని KVPC నిలదీసింది. మానవ హక్కుల కమిషన్ కేసు నెం .3100/2012లోనూ, మెదక్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు (H2/4893/2012)లోనూ కాలుష్యాన్ని నియంత్రించడంలో హెటెరో కంపెనీ విఫలమైందని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. అవసరమైతే పోలీసుల సహాయంతోనైనా చెరువును శుభ్రం చేయించాలని అప్పట్లో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కాలుష్యం లేకుంటే తహసీల్దార్ కార్యాలయంలో రహస్యంగా ఎకరాకు రూ.12 వేల చొప్పున చెక్కులు ఎందుకు పంపిణీ చేస్తున్నారని KVPC ప్రశ్నించింది. రైతుల పట్టా పాస్‌బుక్కులు, ఆధార్ కార్డులు సేకరించి దొంగ చాటుగా వ్యవహరించడం ప్రజల గొంతు నొక్కడానికి ఇచ్చే లంచమేనని ఆరోపించింది. హెటెరో కంపెనీలో నిజంగా ZLD (Zero Liquid Discharge) ప్లాంట్ పనిచేస్తుంటే మీడియా, గ్రామస్తులకు బహిరంగంగా చూపించాలని KVPC సవాల్ విసిరింది. అలాగే కంపెనీకి ఏజెంట్లుగా మారి రహస్య సమావేశాలు నిర్వహిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గ్రామ ప్రజలను ఉద్దేశించి KVPC మాట్లాడుతూ, పన్నెండేళ్ల క్రితమే హెటెరో కంపెనీ కాలుష్యం చేస్తోందని PCB, కలెక్టర్, HRC పత్రాల ద్వారానే రుజువైందని పేర్కొంది. ఇప్పుడు ఇస్తున్న అరకొర డబ్బులకు ఆశపడి ప్రజలు తమ ఆరోగ్యం, భూములు, భవిష్యత్తును పణంగా పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. కాలుష్య రహిత దోమడుగు కోసం రాజీలేని పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంగయ జైపాల్ రెడ్డి, కృష్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ గౌడ్, సత్యనారాయన, రమేష్, శ్రీధర్, సత్తి రెడ్డి, శంకరయ్య, రాఘవ రెడ్డి, భాస్కర్, వెంకట రెడ్డి, స్వేచ్ఛ రెడ్డి, పెద్ద రాజు, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాస్వరం కథనానికి స్పందన


## గ్రేటర్‌గా మారినా..
## అధికారుల తీరు మారలేదు

- కాలనీ వాసులపై రామ్‌కి దోస హోటల్ యాజమాన్యం దౌర్జన్యం

**అమీన్‌పూర్, జనవరి 05 (ప్రజా స్వరం) :**

మున్సిపల్ నుంచి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారినా అధికారుల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీరంగూడ నుంచి కృష్ణా రెడ్డి పేట్ వందఫీట్ల రోడ్డు పక్కన ఉన్న రామ్ కి దోస హోటల్ యాజమాన్యం సమీపంలోని సిద్ధి వినాయక కాలనీ వాసులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోటల్ వెనుక వైపు ఉన్న కాలనీలో నివసిస్తున్న ప్రజలు, హోటల్ నుంచి వస్తున్న వ్యర్థాలు, డ్రైనేజీ నీరు, పనివాళ్ల గోల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు హోటల్ యజమాని రమేష్ను కలిసి విన్నవించినా, తనకు ఉన్న పలుకుబడితో కాలనీ వాసులను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. "అధికారులు నేను చెప్పినట్టే వింటారు... ప్రతి ఒక్కరికి మామూలు ఇస్తున్నాను. కావాలంటే నా ఫోన్ పే చెక్ చేయండి" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిపై ఇప్పటికే జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు హోటల్ ముందు మాత్రమే కాకుండా, వెనుక వైపు కాలనీ ప్రాంతాన్ని పరిశీలించి రామ్ కి దోస హోటల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.


## రామ్ కీ దోస హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు నోటీస్

**అమీన్‌పూర్, జనవరి 06 (ప్రజా స్వరం) :**

అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ-కృష్ణా రెడ్డి పేట్ 100 ఫీట్ల రోడ్డుపై ఉన్న రామ్ కీ దోస హోటల్ యాజమాన్యంపై ప్రజా స్వరం పత్రికలో ప్రచురితమైన కథనానికి GHMC అధికారులు వెంటనే స్పందించారు. సిద్ధి వినాయక కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించిన అధికారులు, హోటల్ యాజమాన్యానికి అధికారిక హెచ్చరిక నోటీసును జారీ చేశారు. కాలనీ వెనుక భాగంలో ఉన్న హోటల్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా చెత్తను అక్రమంగా కాలనీలో వేయడం, డ్రైనేజ్ నీటిని కాలనీ వైపు వదలడం, దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు తలెత్తడం, శబ్ద కాలుష్యం, సిబ్బంది దౌర్జన్య ప్రవర్తన వంటి అంశాలు నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సమస్యలపై కాలనీ వాసులు ఇప్పటికే పలుమార్లు హోటల్ యజమాని రమేష్‌కు ఫిర్యాదు చేసినా, పరిష్కారం చేయకపోగా బెదిరింపులకు పాల్పడినట్టు GHMC అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిపారు.

**ఒక రోజు గడువు**

GHMC అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ జారీ చేసిన నోటీసులో, ఒక రోజు లోపు అన్ని సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని, లేనిపక్షంలో GHMC చట్టం 1955, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016, పబ్లిక్ హెల్త్ & సానిటేషన్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయానికి సమస్యలు పరిష్కరించని పక్షంలో హోటల్‌ను సీజ్ చేయడం, మూసివేతతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో స్పష్టం చేశారు.


OFFICE OF THE DEPUTY COMMISSIONER AMEENPUR CIRCLE-47
SERILINGAMPALLY ZONE GHMC

NOTICE

... issues on several occasions. However, instead of resolving the problems, he has been threatening the residents, claiming that due to his influence. Due to this, the health, hygiene, and peaceful living conditions of the colony residents are being severely affected.

Therefore, this notice is hereby issued directing the management of "Ram Ki Dosa" hotel to immediately rectify all the above issues within *one (1) day from the date of this notice.*

In case of failure to comply within the stipulated time, the hotel premises shall be liable for seizure and closure by the concerned authorities, in addition to further action as per GHMC Act, 1955, Solid Waste Management Rules, 2016, and Public Health & Sanitation Regulations applicable to commercial establishments.

Deputy Commissioner
Ameenpur Circle-47
Serilingampally Zone, GHMC





**ప్రజా స్వరం ప్రభావం**

ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజా స్వరం పత్రిక కథనంతో అధికారులు స్పందించడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజా స్వరం మరోసారి ప్రజల గొంతుకగా నిలిచిన ఉదాహరణగా నిలిచింది.

## మా జిల్లా భూములు అమ్ముతున్నారు

- జిల్లా అభివృద్ధికి 30% నిధులు ఇవ్వండి
- జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు
- మేం సమాధానాలు చెప్పలేక పోతున్నాం
- ఇలాగైతే జిల్లాలు ప్రజలు ఉద్యమిస్తారు
- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**వికారాబాద్, జనవరి 06(ప్రజా స్వరం):**

ముఖ్యమంత్రి ఎవరు వచ్చినా రంగారెడ్డి జిల్లాలోని భూములను అమ్ముతున్నారు తప్పా జిల్లా అభివృద్ధికి నిధులు అందించడం లేదని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర శాసనసభల 25వ సమావేశం లో భాగంగా మంగళ వారం శాసన మండలి లో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అధ్యక్షతన సాగిన ప్రత్యేక ప్రస్తావన లలో ఆయన ఈ విషయం ప్రస్తావించారు. నాడు ఎన్టీ రామారావు మొదలు చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, కెసిఆర్, ఇలా ముఖ్యమంత్రి ఎవరైనా రంగారెడ్డి జిల్లాలోని చాలా భూములను వేలాది కోట్లకు అమ్మి సంక్షేమ కార్యక్రమాలను అమలు పరిచేందుకు సదరు నిధులను వినియోగించారని చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల కోసం, ప్రభుత్వాన్ని నిర్వహించడం కోసం రంగారెడ్డి జిల్లా భూములను అమ్మిన జిల్లాకు మాత్రం అందవలసిన స్థాయిలో నిధులు అంద లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన తనను, తమలాంటి నాయకులను ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రభుత్వం విలువైన రంగారెడ్డి జిల్లా అమ్ముకుంటున్న సందర్భంలో జిల్లా అభివృద్ధికి 20% లేదా 30% ఎంత ఇస్తారో పేర్కొని ఆ నిధులను జిల్లా అభివృద్ధికి వినియోగించేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాకు చెందిన భూములను కూడా అమ్మారని ఎకరాకు 150 కోట్ల పై మాటే పలికాయని ఇలా అమ్ముతున్న నిధులలో జిల్లాకు వాటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని, నాయకులను ప్రశ్నిస్తున్నారని, తాము సమాధానం చెప్పలేక పోతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇలాగైతే భవిష్యత్తులో జిల్లాలో ప్రజలు తిరగబడి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తీసుకొచ్చే పరిస్థితులు ఉన్నాయని మహేందర్ రెడ్డి వెల్లడించారు. కనీసం ఈ ప్రభుత్వమైనా రంగారెడ్డి జిల్లాలో అమ్ముతున్న భూముల ద్వారా వచ్చిన డబ్బులలో జిల్లా అభివృద్ధి కోసం కనీసం 40% కేటాయించాలని శాసన మండలి ద్వారా ప్రభుత్వాన్ని కోరుకున్నట్లు మహేందర్ రెడ్డి చెప్పారు.

## ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి




- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, జనవరి 06 (ప్రజా స్వరం):**

మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో వార్డు వారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైన చోట కనీస సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్, ర్యాంపు వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని గుర్తించి, శిక్షణ తరగతుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా అప్రమత్తతతో ఎన్నికల విధులను నిర్వర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ హుస్సేన్, బలరాం నాయక్, వెంకటయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు పట్టణ ఓటర్ల జాబితాలో తీవ్ర వ్యత్యాసాలు

- గందరగోళంగా ఓటర్ల విభజన
- తక్షణ విచారణ కోరుతున్నాం
- పైలెట్ రోహిత్ రెడ్డి

**వికారాబాద్, జనవరి 06 (ప్రజా స్వరం) :**



ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, తప్పుగా నమోదు అయిన ఓటర్ల పేర్లను తొలగించి, గత మున్సిపల్ ఎన్నికల వార్డు మ్యాపింగ్ ప్రకారం సరిచేసి ఓటర్ల జాబితాను రూపొందించాలని పైలెట్ రోహిత్ రెడ్డి మంగళ వారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. తాండూరు పట్టణంలో తాజాగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు రోహిత్ రెడ్డి తెలిపారు. వార్డుల వారిగా జరిగిన ఓటర్ల విభజన కూడా చాలా గందరగోళంగా ఉందన్నారు. 2019-2020 మున్సిపల్ ఎన్నికల సమయంలో తాండూరు పట్టణంలో మొత్తం ఓటర్ల సంఖ్య 64,090గా ఉండగా, 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి ఈ సంఖ్య 66,304కు పెరిగిందన్నారు. అంటే నాలుగేళ్ల వ్యవధిలో కేవలం 2,214 ఓటర్ల మాత్రమే పెరుగుదల నమోదు కాగా తాజాగా 2026 సంవత్సరానికి విడుదలైన ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 77,110 అంటే 2023 తర్వాతి కాలంలోనే 10,806 ఓటర్లు అదనంగా నమోదైనట్లు అవుతోందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన ఓటర్లు, సహజ జనాభా పెరుగుదల కారణంగా కొంతమేర పెరుగుదల సహజమే అయినప్పటికీ, ఈ స్థాయిలో ఒకేసారి ఓటర్ల సంఖ్య పెరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, అర్హతలేని మరియు తప్పుగా నమోదు అయిన ఓటర్ల పేర్లను తొలగించి, గత మున్సిపల్ ఎన్నికల వార్డు మ్యాపింగ్ ప్రకారం సరిచేసి ఓటర్ల జాబితాను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, నరేందర్ గౌడ్, సలీం, అనురాధ, రవీందర్, బషారత్ అలీ, యూనిస్, అంజద్ ఖాన్, జావేద్, టిప్పు, నరసింహ, అస్ఫక్ తదితరులు ఉన్నారు.




## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన శ్యామ్ యాదవ్

**మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**

ప్రజలకు సేవ చేసే దృక్పథం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని సామాజిక సేవ నాయకులు శ్యామ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కల్లకల్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో 250 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులతో పాటు గ్యాస్ సిలిండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని వారికి తమ వంతు సహకారం చేసి ప్రభుత్వ పాఠశాలలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవ్య నాగరాజ్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు శ్రావణి, సోషల్ వర్కర్ విద్యాసాగర్, ఉపసర్పంచ్ ప్రవీణ్ ముదిరాజ్ వార్డు సభ్యులు ఆరిఫ్, మల్లేష్, ఇర్ఫాన్, సాయంబాబు, సురేష్, నవీన సత్యనారాయణ రజక గ్రామస్తులు కనిగిరి కృష్ణ, నగేష్ గుప్తాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా పద్మా దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు







- **ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
- **ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ**

**మెదక్ జనవరి 06 (ప్రజా స్వరం)**

జనహృదయనేత, పేదల పెన్నిధి, అనునిత్యం ప్రజాసేవ కోసం పరితపించే నాయకురాలు, ఆపదలో నేనున్నానంటు అండగా నిలిచే గొప్ప నాయకురాలు, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,తెలంగాణ తొలి మాజీ డిప్యూటీ స్పీకర్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి 57 వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ వారి నివాసం కొంపల్లిలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కొంపల్లిలోని వారి నివాసంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్లు నాయకుల ఆధ్వర్యంలో పద్మ దేవేందర్



రెడ్డి చేత కేక్ కట్ చేయించారు, పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి. విజయ లక్ష్మి యాదగిరి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బాదే. చంద్రం, పట్టణ నాయకులతో కలసి గజమాలతో ఘనంగా సన్మానించి కేక చేయించారు.



అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు కలసి కేక్ ను ఒకరికొకరు తినిపించుకొని స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ పద్మ దేవేందర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఎల్లప్పుడూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి పద్మ దేవేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు జయరాజ్, కిషోర్,ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, జెల్ల గాయత్రి, సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు లింగారెడ్డి, జుబెర్ అహ్మద్, కండెల. సాయిలు నాయకులు ప్రభు రెడ్డి, ఏనుగుల. రాజు ,శంకర్,నగేష్, మధు, రుక్మా చారి, ఫాజిల్,గోపాల్, సంతోష్, శ్రీనివాస్ గౌడ్,శ్రీను నాయక్ స్వామి నాయక్,మోహన్ నాయక్, ఎంబిపూర్ మహేష్, రంజిత్, కిరణ్,చంద్ పాషా భువన్ పాల్గొన్నారు.

# గజ్వేల్, తూప్రాన్‌లో బీజేపీ విజయం ఖాయం

- **ఎంపీ రఘునందన్ రావు**

**తూప్రాన్ జనవరి 6(ప్రజస్వరం) :**



మెదక్ జిల్లా తూప్రాన్లో బిజెపి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం లో పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు.... బిజెపి పార్టీ రాష్ట్రంలో 750 కి పైగా సర్పంచ్ సీట్లను గెలుచుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు ఆయన మాట్లాడుతూ తాను మెదక్ ఎంపీగా గెలిచిన తర్వాత మెదక్ పార్లమెంట్ స్థాయి లో 85 సర్పంచ్ సీట్లు 100కు పైగా ఉపసర్పంచ్ సీట్లు 500 కు పైగా వార్డు మెంబర్లు గెలుచుకుందామన్నారు తూప్రాన్ మున్సిపల్ ఓటర్ల జాబితా గందరగోణంగా ఉందని గజ్వేల్ మున్సిపల్ లో 12 వేలకు పైగా ఓటర్లను జాబితాలో చేర్చారన్నారు గజ్వేల్ తూప్రాన్ రెండు మున్సిపాలిటీలో బిజెపి జండా ఎగారావేస్తాము అని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఈ సమావేశం లో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్ సురేశ్ గౌడ్ రాంమోహన్ గౌడ్ జానకి రామ్ గౌడ్ మధుసుధన్ రెడ్డి నత్తి మల్లేష్ మహేష్ గౌడ్ తాటి విట్టల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడిగా రాంరెడ్డి

**మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**

మనోహరాబాద్ మండల ఉప సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడిగా శింగి రామ్ రెడ్డి ఉప అధ్యక్షులు గా రంగయ్యపల్లి ఉప సర్పంచ్ భాను మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో మంగళవారం నాడు ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచుల సమస్యల కోసం కృషి చేస్తుననీ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్లు ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు

# చౌక ధరకు సరుకులు అందించడమే లక్ష్యం

- **మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్**

**జవహర్ నగర్, జనవరి 6, ప్రజాస్వరం :**

మేడ్చల్ నియోజకవర్గం, జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును మంగళవారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలకు నిత్యావసర సరుకులు చౌక ధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ షాపులు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే కాలనీ వాసులకు ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం ఆనందకరమని పేర్కొన్నారు. డీలర్ రజిత గోపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్,సీనియర్ నాయకులు సాధనంద్,మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్సీ కవిత.. నోరు అదుపులో పెట్టుకో

- **బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్ రెడ్డి**

**గజ్వేల్/వర్గల్ జనవరి 06 ప్రజస్వరం:**



నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడపల బాల్ రెడ్డి ఎమ్మెల్సీ కవిత కు హెచ్చరించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చెల్లని రూపాయి అని బిఆరెస్ పార్టీ నాయకులపై అవగాహన లేకుండా చేసిన విమర్శలపై ఖండించారు. మంగళవారం గౌరారంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.. బీఆర్ఎస్ పార్టీకి కవిత శనిలా దాపురించారన్నారు. అయినా తాము తెలంగాణ జాతిపితైన కేసీఆర్ బిడ్డగా గౌరవించామన్నారు. బిఆరెస్ నాయకుల పై కవిత చేసిన వాఖ్యలు వారు ఖండించారు. శాసనమండలిలో ఈ వ్యక్తిగత విషయాలు చెప్పడానికా...! ప్రజా సమస్యలు చెప్పడానికా అని వివరించారు. ఎవరికి లాభం జరుగుతుందని వారు తెలిపారు. కవిత కన్నీళ్లు పెట్టుకున్న పద్ధతి వారికే నష్టం జరుగుతుందని చెప్పారు.

# 5వ నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఆన్లైన్ దరఖాస్తులు




**దౌల్తాబాద్ జనవరి 6( ప్రజాస్వరం ):**

2026-27 విద్యాసంవత్సరానికి గాను గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జోష్న ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, జనవరి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 5వ తరగతికి నూతన విద్యార్థులతో పాటు, 6వ నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# బోరు కేబుల్ దొంగల ముఠా అరెస్ట్

- **చాకచక్యంగా కేస్ చేదించిన ప్రత్యేక బృందం**
- **నిందితులు రిమాండ్ కు తరలింపు**
- **గజ్వేల్ ఏసిపి నర్సింలు**

**దౌల్తాబాద్ జనవరి 6(ప్రజాస్వరం) :**

గత సంవత్సర కాలం నుంచి రహదారులకు పక్కన ఉన్న వ్యవసాయ పొలాలలోని బోరు బావుల వద్ద సర్వీస్ కేబుల్ వైర్లను దొంగలించి, వాటిలో నుంచి కాపర్ వైర్లను తీసి విక్రయిస్తూ జల్సాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను తొగుట సిఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ కుంచం మానస ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అరెస్టు చేయడం జరిగిందని గజ్వేల్ ఏసిపి నర్సింలు తెలిపారు. మంగళవారం రాయపోల్ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశంలో నిందితులను హాజరపరిచి దొంగలించిన వస్తువులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా సిద్దిపేట, మెదక్, మేడ్చల్ జిల్లాలో రహదారులకు పక్కన ఉన్న వ్యవసాయ పొలాలను లక్ష్యంగా చేసుకొని కేబుల్ సర్వీస్ వైర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల రాయపోల్ పోలీసులు వడ్డేపల్లి గుర్రాలసోప వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టగా మరో దొంగతనానికి వెళ్తున్న ఐదుగురు అనుమానితులు పోలీసులను చూసి పారిపోయారు. ఈ వరుస దొంగతనాలు సిద్దిపేట జిల్లాలోని కుకునూర్ పల్లి (04), రాయపోల్ (04), తొగుట (2), మెదక్ జిల్లా చేగుంట (01), మేడ్చెల్ జిల్లా షామీర్ పేట్ (01) పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 12 వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠా సభ్యులు (07) మందిని అదుపులోకి తీసుకున్నాము. ఐదుగురు నిందుతులను విచారించగా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరానగర్ గ్రామానికి చెందిన పిట్ల ధనుష్, సిద్దిపేట జిల్లా గజ్వేల్ కి చెందిన సత్తు వంశీ, సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్, సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అక్కారం గ్రామానికి చెందిన దూదేకుల సల్మాన్, సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరానగర్ గ్రామానికి చెందిన ఒంక మహిపాల్. వీళ్ళు ఐదుగురు ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు ఒకరికొకరు పరిచయమైనారు.సత్తు వంశీ అనే వ్యక్తికి తల్లిదండ్రులు లేనందున ఒక్కడే గజ్వేల్ లో ఒక రూమ్ కిరాయికి తీసుకొని ఉండగా వీరు ఐదుగురు అతని రూమ్ కి వెళ్లి మద్యం తాగుతుండేవారు. వీరు వేరు వేరు పనులు చేసినప్పటికీ రాత్రి అందరు రూమ్ లోకి వచ్చి మద్యం తాగి అక్కడే పడుకునేవారు. వీరు పని చేస్తే వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోనందున ఏదైనా దొంగతనం చేసి జల్సాలు చేయాలనీ రహదారుల ప్రక్కన గల గ్రామాలను మరియు చుట్టుప్రక్కల గ్రామలను ఎంచుకొని వారి మూడు బైక్ ల పై వెళ్లి రైతుల వ్యవసాయ భూముల వద్ద గల బోర్ మోటార్ కేబుల్ వైర్ లను కటింగ్ ప్లేయర్ సహాయముతో కట్ చేసి అక్కడే నిర్మానుష్య ప్రదేశంలో వైర్ ని కాల్చి అందులో నుండి కాపర్ వైర్ తీసి వారికి తెలిసిన స్క్రాప్ షాప్ వాళ్లైనా కర్ణాటక రాష్ట్రం గురుమిట్కల్ జిల్లా యాదగిరి తాలూకా బద్ధిపల్లి కి చెందిన ఇద్దరు వ్యక్తులు గణేష్ పల్లి దగ్గర స్క్రాప్ షాప్ మల్లేష్ (మల్లప్ప), ధర్మారెడ్డి పల్లి వద్ద స్క్రాప్ షాప్ నిర్వాహకుడు బీరప్ప, చిల్లప్ప యొక్క షాప్ లో విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండే వారు, అలా పలు చోట్ల దొంగతనాలకి పాల్పడుతున్నారు. అదే క్రమంలో అయిదుగురు దొంగతనానికి వారి యొక్క ద్విచక్ర వాహనాల పై వెళ్తుండగా గుర్రలసోఫా వద్ద పోలీస్ వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పెట్టుకొని చెక్ చేయగా బైక్ కవర్ లలో రెండు కటింగ్ ప్లైర్ లు దొరుకగా వారిని విచారించగా పోయిన సంవత్సరం నుండి మొన్నటి వరకి వరకు గ్రామా శివారులో ఉన్న వెళ్లి రైతుల వ్యవసాయ భూముల వద్ద గల బోర్ మోటార్ కేబుల్ వైర్ లను లక్ష్యంగా పెట్టుకుని అందులోని కాపర్ వైర్ లు వరుస దొంగతనాలకు పాల్పడినమని వారు దొంగలించి అమ్మిన కాపర్ వైర్, పోలిస్ వారు స్వాధీనముచేసుకున్నారని తాము చేసిన నేరాలు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ. 70 వేల విలువగల 90 కిలోల కాపర్ వైర్, 2 లక్షల 10 వేల విలువగల మూడు ద్విచక్ర వాహనాలు, మొత్తం 2లక్షల 80 వేల విలువగల వస్తువులను స్వాధీన పరుచుకోవడం జరిగిందన్నారు. కాపర్ వైర్ కొనుగోలు చేసిన వారిలో చిల్లప్ప పరారీలో ఉన్నాడు. సిద్దిపేట కమిషనర్ ఎస్ ఎం విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఇట్టి దొంగలను పట్టుకోవటానికి గజ్వేల్ ఏసిపి నర్సింలు, తొగుట సిఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ ఐ మానసలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలించి వారు సేకరించి నసమాచారము మేరకు వడ్డేపల్లి గ్రామం శివారులోని గుర్రలసోఫా వద్ద వద్ద వాహన తనికీలు చేపట్టి నింధితులను పట్టుకున్నట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో తొగట సిఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ కుంచం మానస, ఏఎస్ఐ దేవయ్య, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య ఉదయ్ భాస్కర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ్‌ను సన్మానించిన అంక్షారెడ్డి

**తూప్రాన్ (ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా సర్పంచ్ ల ఫొరం అధ్యక్షులు గా ఎన్నికైన కొన్నాయి పల్లి సర్పంచ్ మన్నే కళ్యాణ్ ను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షా రెడ్డి సన్మానించారు పదివి తో పాటు బాధ్యత పెరుగుతుందని ఆమె అన్నారు కళ్యాణ్ మాట్లాడుతు నా నమ్మకంతో జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్ష పదవి రావడానికి కృషిచేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి. నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ రాజ్ రెడ్డి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



## బాల కార్మికుల నిర్మూలనపై ఆర్డీవో సమీక్ష

**తూప్రాన్, (ప్రజాస్వరం) :**

తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయం లో ఆపరేషన్ స్మైల్ లో భాగంగ పరిశ్రమలలో పని చేస్తున్న బాల కార్మికుల అంశంపై మంగళవారం తూప్రాన్ డివిజన్ లోని మండల గిర్దావర్లు మరియు గ్రామ పాలన ఆఫీసర్ లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ చట్ట విరుద్ధమని, బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దీనిని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఆర్డీఓ జయ చంద్రా రెడ్డి స్పష్టంగా తెలియజేశారు. 14 సంవత్సరాలలోపు పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని మండలాలు మరియు గ్రామాల పరిధిలో ఉన్న పరిశ్రమలు, వర్క్‌షాప్‌లు, దుకాణాలు, ఇటుక బట్టీలు, చిన్న తయారీ కేంద్రాలు మొదలైన వాటిలో బాల కార్మికులు పనిచేస్తున్నారా అనే విషయంపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బాల కార్మికులు గుర్తించబడిన పక్షంలో వెంటనే వారిని పనుల నుంచి విముక్తి చేసి, సంబంధిత కార్మిక, విద్య, మహిళాశిశు సంక్షేమ శాఖలకు సమాచారం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా బాల కార్మికులను పనిచేయిస్తున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయడంలో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆర్డీఓ జయ చంద్రా రెడ్డి స్పష్టం చేశారు. విముక్తి పొందిన బాలలకు విద్య, పునరావాసం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరియు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులు, పరిశ్రమ యజమానులు మరియు ప్రజలకు బాల కార్మిక వ్యవస్థ దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని ఆర్డీఓ జయ చంద్రా రెడ్డి తెలిపారు.

## సంక్రాంతి తర్వాత అందుబాటులోకి నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు



- **శాశ్వత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు**
- **పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్‌చెరు, జనవరి 06 (ప్రజా స్వరం) :**

సంక్రాంతి పర్వదినం అనంతరం పటాన్ చెరు కేంద్రంగా నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్న పాత తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శాశ్వత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఈ భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతుందని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం కోసం త్వరలోనే భూ కేటాయింపులు జరగనున్నాయని, ఇందుకు సంబంధించి స్థల పరిశీలనలు కొనసాగుతున్నాయని తెలిపారు. సుమారు ఐదు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. జనవరి 20వ తేదీ లోపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్, పంచాయతీరాజ్ డీఈ సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా సైనిక దాడి అప్రజాస్వామికం

- **సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్**

**జవహర్ నగర్, జనవరి 6, ప్రజాస్వరం :**

రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నీచంగా సార్వ భౌమాధికార నియమాలను ఘోరంగా ఉల్లంఘిస్తూ వైమానిక దురాక్రమణ దాడులకు పాల్పడి వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో,ఆయన భార్య సిలియా పో రేస్ ల ను అత్యంత దుర్మార్గ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం బాలాజీ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద డ్రోనాల్డ్ ట్రంప్ దృష్టి బొమ్మని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ మూడో ప్రపంచ దేశమైన వెనిజులపై అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను వారు తీవ్రంగా ఖండించారు ఆ దేశ ప్రజలచే ప్రజా సౌమ్యంగా ఎన్నికైన దేశ అధ్యక్షుడిపై ఆయన కుటుంబం పై ఎలాంటి బెదిరింపులు అరెస్టులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు మానవ హక్కులకు ఐక్యరాజ్య సమితి నియమ నిబంధనలకు దేశాల సార్వభౌమ త్వల ను ఉల్లంఘించడమే వారు అన్నారు వెనిజులా ప్రజలు తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో అమెరికా సామ్రాజ్యవాదం రాజకీయ న్యాయ సైనిక మార్గాలలో సాగిస్తున్న దాడులేనని వారు విమర్శించారు ప్రపంచంలో అత్యధిక నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని ఆ నిల్వలను దోచుకోవాలని నీచ కుట్రలతో సమాజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశ నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్ర వేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలసవాద దురంధారానికి ప్రతిరూపమని తెలిపారు ఇవి అధ్యక్షుడు మధుర పై జరిగిన వ్యక్తిగత దాడులు మాత్రమే కాదని అవి మొత్తము వెనిజులా ప్రజలపై వారి స్వతంత్రం పై హక్కులపై జరిగిన దాడులని పేర్కొన్నారు ఎలాంటి చర్యలు వెనిజులా ప్రజల పోరాట సంకల్పాన్ని బలహీనపరిచేవే లేవని అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గమైన అరెస్టులను వెంటనే ఖండించాలన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారంలో జోక్యాన్ని తక్షణమే ఆపాలని ఆ దేశ సార్వభౌమత్వాన్ని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని భారత ప్రభుత్వం కూడా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు లోను కాకుండా స్వతంత్ర విజయంగా విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు సామ్రాజ్యవాద దౌర్జన్యానికి వ్యతిరేకంగా భారత దేశ ప్రభుత్వం ప్రజలు నిలువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జి తోటపల్లి శంకర్ సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, కాప్రా మండల ఎఐటిసి అధ్యక్షులు ఏ ఎల్లయ్య ,కీసర మండల సహాయ కార్యదర్శి వి రవి నాయక్, సిపిఎం నాయకులు నాగేష్, శ్రీమన్నారాయణ ప్రజా సంఘాల నాయకులు షేక్ షావలి, ముస్లిం మైనార్టీ నాయకులు మహిళా నాయకురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్‌ను కలిసిన పద్మా దేవేందర్ రెడ్డి

**మెదక్ ( ప్రజాస్వరం ) :**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను మెదక్ మాజీ ఎమ్మెల్యే మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన ఆశీర్వాదాలు పొందడం సంతోషంగా ఉందన్నారు.

## పద్మా దేవేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి హరీశ్ రావు





**మెదక్ జనవరి 06 (ప్రజా స్వరం)**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ని మర్యాద పూర్వకంగా మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి పద్మ దేవేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ కూడా పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కోసం ప్రజావాణిలో బీజేపీ నాయకుల వినతి

**జవహర్ నగర్, జనవరి 6, ప్రజాస్వరం :**

జిహెచ్ఎంసి మల్కాజ్గిరి జోన్ లో జవహర్ నగర్ ను, జవహర్ నగర్ సర్కిల్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం "ప్రజా భవన్" "ప్రజావాణి"లో జవహర్ నగర్ బిజెపి నాయకులు వినతి పత్రం. అందజేశారు దీనిపై స్పందించిన ప్రజావాణి ఇంచార్జ్ జి. చిన్నారెడ్డి ఆమోదయోగ్యమైన ఈ సమస్యను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ ఫార్వర్డ్ చేయడం జరిగిందన్నారు. ప్రజలకు సమస్యను దృష్టిలో ఉంచుకొని అన్ని డివిజన్లకు సెంటర్, అత్యధిక జనాభా ఉన్న జవహర్ నగర్ లో జవహర్ నగర్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ లోని రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత, జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ అధ్యక్షుడు కమల్ ,రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి ముత్యం సుజాత , మాజీ బీజేవైఎం అధ్యక్షులు రామ్ నాయక్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల యాదగిరి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ పటేల్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కొంపెల్ల చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999